సాక్షి నల్లగొండ

శుక్రవారం । 16 । జూన్ । 2023



బీజేపీ, బీఆర్ఎస్ తోడుదొంగలు

రింగ్ రోడ్డు విషయంలో కేంద్ర, రాష్ట్రాలు తోడు దొంగల్లా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ నేత కోదండరెడ్డి ఆరోపించారు. - 10లో



కల్నల్ సంతోష్‌బాబు వర్ధంతి

దివంగత కల్నల్ సంతోష్ బాబు త్యాగం చిరస్మరణీయంగా నిలిచిపోతుందని రాష్ట్ర మంత్రి జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
41°/28°

వాతావరణం

పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడం వల్ల ఉక్కబోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

366 మంది గైర్హాజరు

రామగిరి(నల్లగొండ): ఇంటర్ సప్లిమెంటరీ మాథ్స్, జువాలజీ, హిస్టరీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం జరిగిన ఫస్టియర్ పరీక్షలకు మొత్తం 4,823 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 4,547 మంది హాజరయ్యారు. 276 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షలకు మొత్తం 1,865 మంది విద్యార్థులకు 1,775 మంది హాజరు కాగా, 90 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు.

టెన్త్ హిందీ పరీక్షకు 47 మంది..

టెన్త్ సప్లిమెంటరీ హిందీ పరీక్షకు 47 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో 7 పరీక్ష కేంద్రాల్లో 58 మంది విద్యార్థులకు 11 మంది పరీక్షకు హాజరయ్యారని డీఈఓ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

మూసీ ప్రాజెక్టు సందర్శన



ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎన్నికల ఆఫీసర్ రాఘవేంద్ర, అధికారులు

కేతేపల్లి: మండల పరిధిలో ఉన్న మూసీ ప్రాజెక్టును గురువారం రాష్ట్ర జాయింట్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ వి.రాఘవేంద్ర సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారులతో కలిసి డ్యాంపై కాలినడకన పర్యటించారు. మూడో నంబర్ క్రస్టు గేటు ఎత్తి ఉండటంతో దిగువకు వెళ్తున్న నీటిని పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణం, నీటినిల్వ సామర్థ్యం, ఆయకట్టు తదితర వివరాలను ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సూర్యాపేట జిల్లా సివిల్ సప్లయ్ డీఎం రాంపతి, సూర్యాపేట తహసీల్దార్ వెంకన్న, మూసీ ప్రాజెక్టు ఏఈ ఉదయ్ ఉన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

కేతేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ భిక్షపతి సూచించారు. కేతేపల్లి మండలంలోని తుంగతుర్తి గ్రామంలో గల ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి పాఠశాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను బడిబాట కార్యక్రమం ద్వారా పిల్లల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడిన డీఈఓ ఐదేళ్లు నిండిన పిల్లల వివరాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాలల బలోపేతంపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వి.మురళీకృష్ణ, తన్నీరు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

9,500 గొర్రెల యూనిట్లు మంజూరు : దూదిమెట్ల



బాలరాజును సన్మానిస్తున్న యాదవులు

చిట్యాల: గొల్లకురుమలకు గొర్రెల పంపిణీ పథకం కింద రెండో విడతలో భాగంగా నల్లగొండ జిల్లాకు 9,500 యూనిట్‌లు మంజూరయ్యాయని తెలంగాణ గొర్రెలు మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ తెలిపారు. చిట్యాలలో నూతనంగా ఎన్నికైన గొర్రెల మేకల సొసైటీ డైరెక్టర్లకు గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గొర్రెల యూనిట్ లబ్ధిదారులుగా ఎంపికయి మృతి చెందినట్లయితే మృతి చెందిన వ్యక్తి భార్య పేర యూనిట్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం బాలరాజు యాదవ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, కౌన్సిలర్ బెల్లి సత్తయ్య, యాదవ సంఘం నాయకులు ఏళ్ల బయ్యన్న, నక్క మల్లేష్, దూదిమెట్ల శివయాదవ్, ఆవుల ఆనంద్, ఆగు అశోక్, రెమిడాల ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు జగిని భిక్షంరెడ్డి, రుద్రవరం యాదయ్య, జిట్ట చంద్రకాంత్ పాల్గొన్నారు.

ఎన్నికలకు కసరత్తు

- 19 నుంచి ఈవీఎంల మొదటి లెవల్ తనిఖీలు ప్రారంభం
- ఈసీఐఎల్ నుంచి రానున్న 15 మంది ఇంజనీర్లు
- జూలై 31లోగా ఉద్యోగుల బదిలీలు పూర్తి చేయాలని నిర్ణయం
- ఇప్పటికే కొనసాగుతున్న ఓటరు జాబితా స్పెషల్ రివిజన్



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: మరో నాలుగైదు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అందుకు అవసరమైన ఏర్పాట్లపై కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఈవీఎంల పరిశీలన ఈనెల 19వ తేదీన నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే ఓటరు జాబితా ముసాయిదా సవరణ కార్యక్రమం కొనసాగుతోంది. అక్టోబర్ 4న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నారు. ఇక ఇప్పటికే ఎన్నికల నియమావళి మేరకు అధికారులను కూడా బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించిన విషయం తెలిసిందే. జూలై 31వ తేదీలోగా బదిలీలు చేయాల్సి ఉంది. దీంతో యంత్రాంగం బదిలీల కార్యాచరణపై కూడా కసరత్తు మొదలుపెట్టింది.

వేగంగా ఓటరు జాబితా రివిజన్

ఓటరు జాబితా స్పెషల్ సమ్మర్ రివిజన్ కార్యక్రమం జిల్లాలో వేగంగా సాగుతోంది. 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించనుంది. మరోవైపు ఓటును ఒకచోటనుంచి మరో చోటికి బదిలీ చేసుకోవడంతోపాటు రెండు ఓట్లు ఉన్నవాటిని తొలగించడం, చనిపోయిన వారి ఓట్లు కూడా తొలగించే కార్యక్రమం నిర్వహిస్తోంది. వాటిపై వచ్చిన ఫిర్యాదులను కూడా పరిష్కరించి అక్టోబర్ నాలుగో తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ జాబితా ఆధారంగానే ఎన్నికలు జరగనున్నాయి.

19 నుంచి పరిశీలన

ఈనెల 19వ తేదీ నుంచి ఈవీఎంల పరిశీలన కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈసీఐఎల్ కంపెనీ నుంచి ఈవీఎంలు జిల్లాకు వచ్చాయి. అందులో 3,158 బ్యాలెట్ యూనిట్లు, 2,466 కంట్రోల్ యూనిట్లు 2,667 వీవీ ప్యాట్‌లు ఉన్నాయి. వాటన్నింటికి ఈనెల 19 నుంచి జూన్ 7వ తేదీ వరకు మొదటి లెవల్ చెకింగ్ చేపట్టనున్నారు. ఈ ప్రక్రియను చేపట్టేందుకు ఈసీఐఎల్ కంపెనీకి చెందిన 15 మంది ఇంజనీర్లు రానున్నారు.

గతంలో వాడిన యంత్రాలు మహారాష్ట్రకు..

జిల్లాలో గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్, నాగార్జునసాగర్, మునుగోడు ఉప ఎన్నికల్లో వాడిన బీహెచ్ఈఎల్ కంపెనీకి చెందిన ఓటింగ్ యంత్రాలను మహారాష్ట్రలోని చంద్రపురి జిల్లాకు పంపుతున్నారు. ఇందులో 1,940 బ్యాలెట్ యూనిట్లు, 644 కంట్రోల్ యూనిట్లు, 677 వీవీ ప్యాట్‌లు ఉన్నాయి. వాటన్నింటిని కొన్ని బీహెచ్ఈఎల్ కంపెనీకి పంపగా మిగిలిన వాటిని మహారాష్ట్రకు పంపుతున్నారు.

జూలై 31లోగా బదిలీలు పూర్తి చేసేలా..

ఎన్నికల సంఘం ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మూడేళ్లు ఒకే చోట పనిచేసిన ఉద్యోగులను బదిలీ చేయాలని ఆదేశించింది. అదే విధంగా సొంత జిల్లాలో పనిచేసే అధికారులను బదిలీ చేయనున్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పనిచేసి సస్పెండ్‌కు గురైన వారికి వచ్చే ఎన్నికల్లో విధులను అప్పగించరాదని ఆదేశించింది. వాటన్నింటిని దృష్టిలో ఉంచుకొని జూలై 31లోగా బదిలీ ప్రక్రియను పూర్తి చేసి ఎన్నికల సంఘానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. దాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించింది.

నేడు జిల్లా వ్యవసాయాధికారితో ఫోన్ ఇన్



ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ముందస్తు సాగుపై అనుమానాలు ఉన్నాయా.. విత్తనాలు, ఎరువుల కొరత ఎదుర్కొంటున్నారా.. నకిలీ విత్తనాల బెడద ఉందా.. అయితే, జిల్లా వ్యవసాయ అధికారి సుచరితకు ఫోన్ చేసి రైతులు సందేహాలను నివృత్తి చేసుకోండి. ఏ పంటలు సాగుచేయాలనే విషయాలనూ అడిగి తెలుసుకోవచ్చు.

సమయం : ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్ : 72888 94477

కేసీఆర్‌తోనే పల్లెలు సమగ్రాభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు, చిత్రంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఆర్డీఓ తదితరులు

- మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు
- శ్రీనివాస్‌నగర్‌లో పల్లె ప్రగతి దినోత్సవం
- హాజరైన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

మిర్యాలగూడ: ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన పల్లెలు తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చెందాయని మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్‌లో నిర్వహించిన పల్లె ప్రగతి దినోత్సవంలో జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న కరెంట్ బాధలు ప్రస్తుతం లేవన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలో కొత్తగా ఏర్పడిన 58 గ్రామ పంచాయతీలకు రూ.11.60కోట్లతో నూతన భవనాల నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. కొత్తగా ఏర్పడిన శ్రీనివాస్‌నగర్ గ్రామం అన్నిరంగాల్లో అభివృద్ధి చెంది 17 అవార్డులు గెలుచుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పల్లెలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. రాష్ట్ర స్థాయి అవార్డు గెలుచుకున్న శ్రీనివాస్‌నగర్ గ్రామ పంచాయతీ రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలో సైతం గెలుచుకునేందుకు మరింతగా కృషి చేయాలని కోరారు. గ్రామ సర్పంచ్ భోగవెల్లి వెంకటరమణచౌదరి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, ఎంపీపీ నూకల సరళహన్మంతరెడ్డి, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, డీఈ వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ వీరారెడ్డి, ఎంపీటీసీ ఇస్లావత్ సుజాత, ఉపసర్పంచ్ అచ్యుతరామయ్య, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

హరితహారాన్ని విజయవంతం చేయండి

వేములపల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న నిర్వహించే హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కోరారు. గురువారం వేములపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో హరితహారం నిర్వహించే స్థలాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మండలంలో ఏ గ్రామంలో ఎన్ని మొక్కలు నాటుతున్నారనే సమాచారాన్ని సేకరించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ అజ్మీరాదేవిక ఉన్నారు.

‘ప్రగతి’ పండుగకు సిద్ధం



నీలగిరిలో ర్యాలీ నిర్వహించేందుకు మున్సిపల్ సిబ్బంది సిద్ధం చేసిన ట్రాక్టర్లు

నేడు పట్టణ ప్రగతి దినోత్సవం

- అన్ని ఏర్పాట్లు చేసిన నీలగిరి మున్సిపల్ యంత్రాంగం
- కళాభారతి స్థలంలో సభ నిర్వహణ
- హాజరు కానున్న మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రమైన నీలగిరి మున్సిపాలిటీలో పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధమైంది. నీలగిరి పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్‌లో మున్సిపాలిటీ కళాభారతి స్థలంలో పట్టణ ప్రగతి దినోత్సవ సభ నిర్వహించేందుకు మున్సిపల్ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సభకు 4 వేలకుపైగా జనాన్ని సమీకరించనున్నట్లు తెలిసింది.

అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించేలా..

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గడిచిన 9 సంవత్సరాల్లో నీలగిరి పట్టణంలో రూ.805 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో కొన్ని పూర్తి కాగా మరికొన్ని టెండర్ల దశలో ఉన్నాయి. వీటిలో ప్రధానంగా రహదారుల విస్తరణ, మురుగు కాల్వలు, వరద కాల్వలు, ఉదయ సముద్రం సుందరీకరణ, శిల్పారామం, కళాభారతి నిర్మాణం, మిషన్ భగీరథ అర్బన్‌ఫేజ్ -2, పార్కుల అభివృద్ధి, మీడియం ప్లాంటేషన్, వల్లభరావు సుందరీకరణ, ఇండోర్ స్టేడియం, వైకుంఠ ధామాల పనులు చేపట్టారు. దీంతో పట్టణం అంతా హైదరాబాద్ నగరాన్ని తలపించేలా అభివృద్ధి జరిగిందనే చర్చ ప్రజల్లో ఉంది. వీటన్నింటికి ప్రభుత్వం ఎన్ని నిధులు కేటాయిందో పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తారు.



గడియారం సెంటర్‌లోని కళాభారతి స్థలంలో సిద్ధమవుతున్న సభావేదిక

నేడు ముగ్గుల పోటీలు, ర్యాలీ

పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా ఉదయం 8 గంటలకు ఎన్జీ కాలజీ మైదానంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ముగ్గుల పోటీలు పూర్తయిన తరువాత ఎన్జీ కాలేజీ నుంచి పెద్ద గడియారం సెంటర్ మీదుగా సాగర్ రోడ్డు, భాస్కర్ టాకీస్, ప్రకాశం బజార్ మీదుగా కళాభారతి స్థలం వరకు భారీ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. మధ్యాహ్నం 12 గంటలకు పెద్ద గడియారం సెంటర్‌లో మానవహారం నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు కళాభారతి స్థలంలో జరిగే పట్టణ ప్రగతి సభ నిర్వహిస్తారు. ఈ సభకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి హాజరుకానున్నారు.

25న బీజేపీ చీఫ్ నడ్డా రాక

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నల్లగొండకు రానున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆయన బహిరంగ సభ ఉంటుందని వెల్లడించాయి. మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా 100 నియోజకవర్గాలలో పార్టీ సభలు నిర్వహించాలన్న లక్ష్యంలో భాగంగా నల్లగొండలో నడ్డా సభ నిర్వహణకు బీజేపీ నిర్ణయించినట్లు పేర్కొన్నాయి. వాస్తవానికి ఈ నెల 25న నాగర్‌కర్నూల్‌లో నడ్డా సభ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. అయితే, అక్కడికి బదులు నల్లగొండలో నిర్వహించే అవకాశం ఉందని బీజేపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు ప్రసాద్ తెలిపారు.

జాడలేని నైరుతి రుతుపవనాలు

- గత సంవత్సరం జూన్ రెండో వారంలోనే పలకరింపు
- ఈ సారి మూడో వారమైనా అతీగతిలేవు
- వానాకాలం సాగు పనులు ఆలస్యమయ్యే అవకాశం
- ఎండలతో అల్లాడుతున్న జనం



నల్లగొండ అగ్రికల్చర్: వానాకాలం సీజన్ ఆరంభమైనప్పటికి జిల్లాలో నైరుతుపవనాల జాడ కనిపించడంలేదు. జూన్ రెండో తేదీన కేరళను తాకిన రుతుపవనాలను జూన్ మొదటి వారంలో తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. జూన్ మూడో వారం దాటుతున్నప్పటికి నేటికీ రుతుపవనాల జాడేలేదు. గత వానాకాలం సీజన్‌లో తెలంగాణలో జూన్ మొదటి వారంలో నైరుతుపవనాలు ప్రవేశించడంతో పాటుగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో వర్షాలు కురిసినట్లు వ్యవసాయశాఖ పేర్కొంది. ప్రస్తుతం జూన్ మూడో వారంలో అప్పటికే దుక్కులు దున్నుకుని సిద్ధంగా ఉన్న రైతులు పత్తి వితనాలు విత్తుకున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ఆరంభమై మూడు వారం నడుస్తున్నా నైరుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించలేదు. దీంతో జిల్లాలో నైరుతి చినుకుల జాడలేని కారణంగా వ్యవసాయ పనులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

వానాకాలం పంటల సాగు అంచనా (ఎకరాల్లో..)

పంట	విస్తీర్ణం
పత్తి	6.50 లక్షలు
వరి	5.25 లక్షలు
కంది	10 వేలు

వేరుశనగ, పెసర, ఇతర పంటలు 12 లక్షలు

సాగని ‘ముందస్తు’..

ఈ సారి వరిపంటను ముందస్తుగా సాగు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం రైతులను సూచిస్తున్నప్పటికీ వర్షాలు రాకపోవడంతో సాగు పనులు ముందుకు సాగడం లేదు. అక్కడక్కడ నాన్ ఆయకట్టు ప్రాంతంలో బోర్ల కింద వరినార్లు పోసుకున్నప్పటికి వర్షాలు లేక ఎండల కారణంగా వరినార్లు ఎండుతున్నాయి. దీంతో వరినాట్లు మరింత ఆలస్యం కానున్నాయి. జిల్లా అంతటా రైతులు దుక్కులు దున్నుకుని పత్తి విత్తనాలు విత్తుకోవడం కోసం సిద్ధంగా ఉన్నారు. పెద్ద ఎత్తున పత్తి విత్తనాలను కొనుగోలు చేసి వర్షాల కోసం చూస్తున్నారు. వర్షాలు పడితే వెంటనే పత్తి విత్తనాలను విత్తుకోవడంతో పాటుగా నార్లు పోసుకున్న రైతులు వరినాట్లు వేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు.

మరో వారం రోజులు పట్టే అవకాశం

నైరుతి రుతుపవనాలు మరో వారం రోజుల్లో తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంటుంది. అదేవిధంగా బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని, ఆ ప్రభావంతో తెలంగాణలో కూడా వారం రోజుల్లో వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ పేర్కొంటుంది. నైరుతి రుతుపవనాలకు తోడు, అల్పపీడనం కారణంగా వర్షాలు కురిస్తే రైతులు వానాకాలం సాగు పనులను ముమ్మరం చేయనున్నారు.

తగ్గని ఎండల తీవ్రత

జూన్ మూడో వారంలోకి అడుగిడినా వర్షాలు మాత్రం కురవడం లేదు. కానీ, ఎండల తీవ్రత ఏ మాత్రం తగ్గడం లేదు. ఉక్కపోత, వడగాలులతో జనం అల్లాడిపోతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల నుంచి 43 డిగ్రీలకు పైగా నమోదు అవుతున్నాయి. దీంతో ఉదయం పది గంటలు దాటితే ప్రజలు బయట తిరగలేకపోతున్నారు. ఈ క్రమంలో రైతులు సాగు పనులు కూడా చేసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి.

ఉరుకులు..పరుగులు

- సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ ఆఫీస్‌ల చుట్టూ బీసీ కుల వృత్తిదారుల ప్రదక్షిణలు
- రూ.లక్ష ఆర్థికసాయానికి దరఖాస్తు చేసుకునేందుకు నానా తంటాలు
- సర్వర్ సతాయిస్తుందంటున్న సిబ్బంది
- గడువు దగ్గర పడుతుందని అర్జీదారుల ఆందోళన



కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం శాలిగౌరారం తహసీల్దార్ ఆఫీస్ వద్ద క్యూకట్టిన అర్జీదారులు



కనగల్ తహసీల్దార్ కార్యాలయం తెరవక ముందే వచ్చి నిరీక్షిస్తున్న జనం

నల్లగొండ: బీసీ కులాల్లోని 15 రకాల కుల వృత్తిదారులకు బ్యాంకులతో సంబంధం లేకుండా పూర్తి సబ్సిడీతో రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తామని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఆర్థికసాయానికి దరఖాస్తు చేసుకునేందుకు ఆయా కుల వృత్తిదారులు కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయాలకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ చేసుకొని సంతకాల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో అంతా ఒకేసారి వస్తుండడంతో కార్యాలయాల్లో సర్వర్లు బిజీగా ఉండడంతో సకాలంలో పని జరగడం లేదు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే పడిగాపులు కాయాల్సి వస్తుందని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

20వ తేదీ వరకు గడువు..

బీసీలకు ప్రభుత్వం ఇచ్చే రూ.లక్ష ఆర్థికసాయానికి సంబంధించి దరఖాస్తుల గడువు ఈనెల 20వ తేదీతో ముగియనుంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉండడం.. ఇటీవల తీసిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా సమర్పించాలని నిబంధన ఉండడంతో ఆయా సర్టిఫికెట్లను వెంటనే జారీచేయాలని మండల అధికారులకు కలెక్టర్ ఆదేశాలిచ్చారు. దీంతో సర్టిఫికెట్ల కోసం వివిధ మండలాల్లోని బీసీ యువత, కుల వృత్తిదారులంతా వారివారి తహసీల్దార్ కార్యాలయాలకు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. పట్టణాల్లో అయితే జనం పోటెత్తుతున్నారు. ఈ క్రమంలో సర్వర్లు సతాయిస్తుండడంతో ఒక్క రోజులో పూర్తి కావాల్సిన పనికి ఐదు రోజులు పడుతుండడంతో దరఖాస్తుదారులకు నిరీక్షణ తప్పడం లేదు. ఈ క్రమంలో తహసీల్దార్, మీ సేవ కేంద్రాల వద్ద సిబ్బంది.. దరఖాస్తుదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇప్పటి వరకు 11 వేల దరఖాస్తులు

ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయానికి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 11వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా ఆరు రోజుల పాటు గడువు ఉండడంతో దరఖాస్తుదారులు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో తమకు కూడా దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని మిగిలిన బీసీ కులాల వారంతా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఐదు రోజుల నుంచి తిరుగుతున్నా..



ప్రభుత్వం ఇచ్చే రూ.లక్ష ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలంటే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలన్నారు. 5 రోజుల క్రితం మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకొని కనగల్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాను. ఇంకా సర్టిఫికెట్ అందలేదు. దరఖాస్తుకు సమయం దగ్గర పడుతుంది. కాబట్టి వెంటనే సర్టిఫికెట్లు ఇవ్వాలి.

– అలకుంట్ల జాన్, శేరిలింగోటం, కనగల్ మండలం

ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు



కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నా. తహసీల్దార్ కార్యాలయానికి వెళితే సర్వర్ పని చేయడం లేదని చెబుతున్నారు. చాలా మంది సర్టిఫికెట్ల కోసం వస్తున్నారు. ఉదయం వచ్చి సాయంత్రం వరకు ఇక్కడే ఉన్నా. ఎప్పుడు ఇస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

– పగిళ్ల సుధాకర్, శేరిలింగోటం

2021 ఏప్రిల్ 1 తర్వాత తీసిన ఇన్‌కం సర్టిఫికెట్ చెల్లుతుంది : కలెక్టర్

నల్లగొండ: వెనుకబడిన తరగతులకు చెందిన కుల వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు 2021 ఏప్రిల్ 1 తర్వాత జారీచేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం చెల్లుబాటు అవుతుందని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ కొత్తగా ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

యువకుడు అదృశ్యం

భువనగిరి: మండల పరిధిలోని చీమలకొండూరు గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమైనట్లు గురువారం భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో అతడి తండ్రి ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీమలకొండూరు గ్రామానికి చెందిన కర్కి బాలమల్లేష్ పెద్ద కుమారుడు భానుప్రసాద్ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో గత కొద్దిరోజులుగా ముభావంగా ఉంటున్నాడు. కాగా గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి బయల్దేరిన భానుప్రసాద్ చీమలకొండూరు గ్రామానికే చెందిన సతీష్ బైక్‌పై వెళ్తుండగా అతడిని లిఫ్ట్ అడిగి కుమ్మరిగూడెం గ్రామంలో దిగాడు. అక్కడ సతీష్ కుమారుడు సంతోష్ కలవగా, అతడి బైక్‌పై ఎక్కి రాయగిరి కమాన్ వద్ద దిగాడు. అనంతరం ఎక్కడికి వెళ్లాడో తెలియరాలేదు. అయితే సాయంత్రం వరకు భానుప్రసాద్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంతో పాటు బంధువుల ఇళ్లలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువకుడి తండ్రి మల్లేష్ భువనగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. భానుప్రసాద్ పసుపు, నల్లని టీషర్ట్ ధరించి ఉన్నాడని, 5 అడుగుల 6 అంగుళాలు ఎత్తు ఉంటాడని, అతడి ఆచూకీ తెలిసిన వారు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

మంటలు అంటుకొని దగ్ధమైన ధాన్యం


కాలిబూడిదైన ధాన్యం

గుండాల: వరి కొయ్యలకు నిప్పంటించగా, ఆ మంటలు పక్కనే ఉన్న సుమారు 24 బస్తాల ధాన్యం అంటుకొని దగ్ధమయ్యాయి. ఈ సంఘటన గుండాల మండలంలోని పెద్దపడిశాలలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపడిశాలకి చెందిన గడ్డం దుర్గయ్య తన రెండెకరాల పొలంలో పండించిన ఆర్ఎన్ఆర్ వరి ధాన్యాన్ని(సన్న ధాన్యం) తన వ్యవసాయ బావి వద్ద బండ మీద ఎండబెట్టాడు. కాగా గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు వరి పొలంలో నిప్పు వేయడంతో వరి కొయ్యలు కాలుకుంటూ వచ్చి ధాన్యానికి మంటలు అంటుకున్నాయి. చుట్టుపక్కల వారు గమనించి దుర్గయ్యకు సమాచారం ఇచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ వడ్లు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.50వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

ఆదుకునే వారి కోసం ఎదురుచూపు

- బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న ఆత్మకూరుకు చెందిన మల్లేశం
- ఇప్పటికే చికిత్సకు రూ. 5లక్షలు ఖర్చు
- మందులకు మరో రూ. 5లక్షలు అవసరమంటున్న వైద్యులు
- దాతలు సాయమందించాలని వేడుకోలు


మల్లేశంకు అన్నం తినిపిస్తున్న భార్య ధనలక్ష్మి

దాతలు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 9959218134

కన్నీటి గాథ

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన బత్తిని మల్లేశం బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. చికిత్సకు ఇప్పటికే రూ.5లక్షల వరకు ఖర్చు చేశాడు. చేతిలో డబ్బులు లేని కారణంగా భార్య బంగారం అమ్మగా వచ్చిన డబ్బులు, బంధువులు సహకారం అందించగా వాటితో చికిత్స చేయించుకున్నాడు. వ్యాధి పూర్తిగా నయం కావడానికి మరో రూ.5లక్షలు అవసరమని డాక్టర్లు చెప్పారు. చేతిలో చిల్లిగవ్వ లేక దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు.

కారు రిపేరు చేస్తున్న క్రమంలో..

మల్లేశం వయసు 38 సంవత్సరాలు. కారు డ్రైవర్‌గా పని చేసేవాడు. భార్య ధనలక్ష్మి కూలి పని చేస్తుంటుంది. వీరికి ఇద్దరు సంతానం. తొమ్మిది సంవత్సరాల బాబు కృష్ణవంశీ, ఏడు సంవత్సరాల పాప లిఖిత ఉన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం తాను నడుపుతున్న కారును రిపేరు చేస్తున్న క్రమంలో తలకు డోర్ తగిలి తీవ్ర గాయమైంది. దీంతో భువనగిరిలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స చేయించుకున్నాడు. అప్పటి నుంచి తలనొప్పితో బాధపడుతున్నాడు. రెండు సంవత్సరాల అనంతరం అతనికి పెరాలిసిస్ వచ్చింది. దీంతో కళ్లు కనిపించకుండా పోయాయి. తలనొప్పి తీవ్రం కావడంతో గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. పెరాలసిస్ సమస్యతో బ్రెయిన్ ట్యూమర్ ఫామ్ అయినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. అక్కడి నుంచి గాంధీ, ఉస్మానియా, నిమ్స్ హాస్పిటల్‌లో చూపించుకున్నాడు. చికిత్స నిమిత్తం రూ. 5లక్షలు ఖర్చు చేశాడు. ప్రస్తుతం ఆరు నెలల నుంచి బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చూపించుకుంటున్నాడు. నెలకు నాలుగు సార్లు ట్రీట్మెంట్ చేయించుకోవాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. మందుల ఖర్చు నెలకు రూ. 50వేల వరకు అవుతుందని, ఏడాది మొత్తం వాడితేనే వ్యాధి తగ్గుముఖం పడుతుందని, లేకుంటే కష్టమని డాక్టర్లు చెబుతున్నారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిలో డబ్బులు లేక ఈ నెల హాస్పిటల్‌కు కూడా పోలేదని వాపోయారు. మల్లేశం మామూలు వ్యక్తిగా మారాలంటే రూ. 5లక్షల వరకు అవసరం ఉంటుంది. దాతలు సహకరించి ట్రీట్‌మెంట్ కోసం ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు.


చికిత్స పొందుతున్న బత్తిని మల్లేశం

చెన్నారంలో 'భట్టి' జన్మదిన వేడుకలు


భట్టికి శుభాకాంక్షలు తెలుపుతున్న శంకర్ నాయక్, గుమ్ముల మోహన్‌రెడ్డి తదితరులు


కేక్ కట్ చేస్తున్న భట్టి విక్రమార్క, చిత్రంలో దుబ్బాక నర్సింహారెడ్డి తదితరులు

- పాదయాత్ర క్యాంపు వద్ద వేడుకల్లో పాల్గొన్న సీఎల్పీ నేత

నల్లగొండ: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. నల్లగొండ నియోజకవర్గం పరిధిలోని జి.చెన్నారం గ్రామం సమీపంలో పాదయాత్ర నిర్వహిస్తున్న క్యాంపు వద్ద వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు. భట్టి సతీమణి నందిని, కుమారులు సూర్య విక్రమాదిత్య, సహేంద్ర విక్రమాదిత్యలు ఆయనతో కట్ చేయించారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటాపాటలతో కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. అమెరికాలో ఉన్న పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఫోన్ చేసి భట్టికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భట్టికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి కార్యకర్తలు, అభిమానులు చెన్నారం గ్రామం తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు దుబ్బాక నర్సింహారెడ్డి, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, నాయకులు బీర్ల ఐలయ్య, కైలాస్, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, వడ్డె నారాయణ, సత్యం, వెంకట్, పద్మ, శకుంతలారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

భట్టికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఏపీ నేతలు

ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో 30 మంది సభ్యుల బృందం చెన్నారానికి వచ్చిన భట్టికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పాదయాత్ర శిబిరం వద్ద పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకరి పద్మశ్రీ , విజయవాడ సిటీ ప్రెసిడెంట్ నారిశెట్టి నర్సింహారావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్ర కిరణ్, అమరావతి అధ్యక్షుడు సురేష్, నాయకులు జంధ్యాల శాస్త్రీ, పోతురాజు ఏసు, వేముల శ్రీనివాస్, దోసపాటి గిరి, రామకృష్ణ, చెరుకు ఆనందరావు, గౌస్, రమణ, సురేష్, గొల్ల కృష్ణ, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు. పాదయాత్ర విజయవంతంగా పూర్తికావాలని విజయవాడ కనకదుర్గ అమ్మ వారికి పూజలు నిర్వహించినట్లు వారు చెప్పారు.

తప్పిన పెను ప్రమాదం

- అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ మినీ బస్సు
- ఒకరిద్దరికి స్వల్పగాయాలు


రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

రాజాపేట: యాదగిరిగుట్ట నుంచి రాజాపేటకు వస్తున్న ఆర్టీసీ మినీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్లపొదల్లోకి దూసుకెళ్లి ఆగింది. ఒకరిద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలు కాగా మిగతా క్షేమంగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన గురువారం రాజాపేట మండలంలోని కాల్వపల్లి సమీపంలో చోటుచేసుకుంది. ప్రయాణికులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట నుంచి రాజాపేటకు ఆర్టీసీ మినీబస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు వస్తున్నారు. మార్గమధ్యలో కాల్వపల్లి సమీపంలోని ఆశ్రమం వద్దకు రాగానే బస్సు అదుపుతప్పి రోడ్డు ఎడమ వైపు చెట్లపొదల్లోకి దూసుకెళ్లి ఆగింది. ఈ ఘటనలో ఒకరిద్దరికి స్వల్ప గాయాలయ్యాయి, స్థానికులు గమనించి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులకు తాగునీరు అందించారు. బస్సు ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొన్నా లేదా బోల్తా పడినా అందులోని ప్రయాణికులు తీవ్రంగా గాయపడేవారు. కాగా డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని కొందరు ప్రయాణికులు పేర్కొన్నారు.

చౌటుప్పల్ బస్‌స్టేషన్‌లో వృద్ధురాలు మృతి


మారమ్మ మృతదేహం

చౌటుప్పల్: పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి ఓ వృద్ధురాలు ఆకస్మికంగా మృతిచెందింది. వివరాలు.. నల్లగొండ జిల్లా గట్టుప్పల మండలం శేరిగూడెం గ్రామానికి చెందిన పంకెర్ల మారమ్మ(65) జ్వరంతో బాధపడుతుండడంతో చికిత్స నిమిత్తం ఆమెను భర్త దేవయ్య హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ వైద్యులు పరీక్షించిన అనంతరం సాయంత్రం స్వగ్రామానికి బయల్దేరారు. హైదరాబాద్‌లో బస్సు ఎక్కి చౌటుప్పల్ బస్‌స్టేషన్‌లో రాత్రి దిగి, స్వగ్రామానికి వెళ్లే మరో బస్సు కోసం వేచి చూస్తున్నారు. అక్కడే ఉన్న బెంచీపై కూర్చొని భార్యాభర్తలు మాట్లాడుకుంటుండగా అంతలోనే మారమ్మ ఆకస్మికంగా కిందపడిపోయింది. పక్కనే ఉన్న ప్రయాణికులు గమనించి అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది పరీక్షించి అప్పటికే మారమ్మ మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా మారమ్మ వడదెబ్బకు గురై మృతిచెంది ఉండవచ్చునని ప్రయాణికులు భావిస్తున్నారు.

స్నేహితుడే హంతకుడు

- మద్యం మత్తులో ఘాతుకం
- వీడిన హత్య కేసు మిస్టరీ


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

సూర్యాపేట క్రైం: సూర్యాపేట పట్టణంలోని సుందరయ్యనగర్‌లో గత నెల 31న రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన వ్యక్తిని అతడి స్నేహితుడే మద్యం మత్తులో హతమార్చినట్లు పోలీసులు దర్యాప్తులో తేలింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ జి. రాజశేఖర్ విలేకరులకు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. సుందరయ్యనగర్‌కు చెందిన నవిల నవీన్, ఆకారపు శేఖర్ ప్రాణ స్నేహితులు. వీరిద్దరూ టిప్పర్ డ్రైవర్లుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత నెల 31న అర్ధరాత్రి శేఖర్, నవీన్‌లు ఇద్దరు కలిసి సుందరయ్యకాలనీలో నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లి మద్యం తాగారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి కొట్టుకున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన నవీన్ పక్కనే దొరికిన ఖాళీ బీరు సీసాతో శేఖర్ తలపై బలంగా కొట్టడంతో అతడు కిందపడిపోయాడు. అయినప్పటికీ ఆగకుండా ఇటుకతో శేఖర్ తలపై కొట్టి, కడుపులో తన్నగా అక్కడికక్కడే మృతిచెందగా, నవీన్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. స్థానికులు శేఖర్ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శేఖర్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు అతడి కాల్‌లిస్ట్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు నవీన్‌ను గురువారం సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో అదుపులోకి తీసుకొని విచారించగా, చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. ఈ మేరకు నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఐ యాకూబ్, హెడ్‌కానిస్టేబుళ్లు గొర్ల కృష్ణ, గోదిశి కరుణాకర్, ఆనంద్ పాల్గొన్నారు.

పశువుల లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తా

- ఒక పశువు మృతి
- డీసీఎంలో ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్రగాయాలు


బోల్తా కొట్టిన డీసీఎంలో పశువులు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ శివారులో హైదరాబాద్‌-విజయవాడ జాతీయ రహదారిపై గురువారం పశువుల లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తా కొట్టింది. చిట్యాల ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపునకు 20 పశువులతో అతివేగంగా వెళ్తున్న డీసీఎం వెలిమినేడు గ్రామ శివారులోకి రాగానే అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న గుంతలోకి వెళ్లి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఒక పశువు మృతిచెందగా, మిగతావి గాయపడ్డాయి. డీసీఎంలో ప్రయాణిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశాఖపట్నంకు చెందిన బాతుగంటి అప్పన్నకి తీవ్ర గాయాలవ్వగా, అతడిని చికిత్స నిమిత్తం స్థానికులు నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. కాగా డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

లారీని ఢీకొట్టిన యాక్టీవా.. యువకుడు దుర్మరణం

మాడుగులపల్లి: యాక్టీవాపై వెళ్తున్న యువకుడు రోడ్డు వెంట ఆగి ఉన్న లారీని ఢీకొట్టి దుర్మరణం చెందాడు. మాడుగులపల్లి టోల్‌ప్లాజా వద్ద అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు జిల్లా తాటికొండ మండలం లాం గ్రామానికి చెందిన మాతంగి సిద్దు(24) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన అతడు బుధవారం సాయంత్రం యాక్టీవాపై హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. రాత్రి 10గంటల సమయంలో మాడుగులపల్లి టోల్‌ప్లాజా సమీపంలోని కంకర మిల్లు వద్ద యాక్టీవా రోడ్డు వెంట నిలిపిన లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో సిద్దు తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని మిర్యాలగూడ రూరల్ సీఐ సత్యనారాయణ పరిశీలించారు. గురువారం మృతుడి మామ చిట్టిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

ఇంట్లోంచి వెళ్లిన బాలుర ఆచూకీ లభ్యం

- తల్లికి అప్పగించిన పోలీసులు


ఇద్దరు బాలురను తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

తుర్కపల్లి: తల్లి మందలించిందని మనస్తాపంతో ఇంటి నుంచి పారిపోయిన ఇద్దరు బాలుర ఆచూకీ లభ్యమైంది. తుర్కపల్లి పోలీసులు గురువారం ఇద్దరిని వారి తల్లికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా దండుపల్లికి చెందిన పిట్టల యాదమ్మ పదిహేను సంవత్సరాలుగా తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో నివాసముంటూ కోళ్ల షెడ్డులో కూలీగా పనిచేస్తుంది. ఈమె భర్త దీవేందర్‌రావుకు ఇద్దరు భార్యలు. పెద్ద భార్య అయిన పిట్టల యాదమ్మకు కుమారులు విజయ్(15) చరణ్(9) ఉన్నారు. పెద్ద కుమారుడు విజయ్ దత్తాయపల్లిలో యాదమ్మ వద్దే ఉంటుండగా, చిన్నకొడుకు చరణ్ మేడ్చల్ జిల్లా దండుపల్లిలో తండ్రి వద్ద ఉండేవాడు. దీవేందర్‌రావు రెండు నెలల క్రితం చింతచెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. దీంతో చిన్న కుమారుడిని కూడా యాదమ్మ దత్తాయపల్లికి తీసుకొచ్చింది.

తల్లి తిట్టిందని..

విజయ్, చరణ్‌లు రోజూ గొడవ పడుతుండడంతో తల్లి యాదమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన వారిద్దరు రెండు రోజుల క్రితం ఇంట్లో ఉన్న రూ.2వేల నగదు, టీవీఎస్ ఎక్సెల్ తీసుకుని ఇంటి నుంచి పారిపోయారు. మంగళవారం రాత్రి వరకు పిల్లల కోసం యాదమ్మ చుట్టుపక్క ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం ఉదయం తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా ఇద్దరూ భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దరావులపల్లి దుర్గమ్మ గుడి వద్ద ఉన్నట్లు గుర్తించి వారిని గురువారం తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. తాము తీసుకువెళ్లిన టీవీఎస్ ఎక్సెల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు బెదిరించి తీసుకువెళ్లారని విజయ్, చరణ్ పోలీసులకు తెలిపారు. ఇద్దరు బాలురను పోలీస్ స్టేషన్‌లో తల్లి యాదమ్మకు అప్పగించారు. పిల్లలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

దేవరకొండ: చెట్టుకు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం దేవరకొండ మండల పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం చింతబావి గ్రామానికి చెందిన కదారి కొండల్(27) చందంపేట మండల పరిధిలోని ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని నెలల క్రితం కొండల్ భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె వైద్యం కోసం దాదాపు రూ.10లక్షల మేర ఖర్చు చేసినప్పటికీ ఆమె మృతి చెందింది. వివాహ సమయంలో కట్నంగా ఇచ్చిన డబ్బులు నాలుగు నెలల వ్యవధిలో తిరిగి ఇచ్చేలా కొండల్‌తో భార్య తరపు బంధువులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో డబ్బులు తిరిగి ఇవ్వలేకపోవడంతో మనస్తాపానికి గురైన కొండల్ గురువారం చింతబావి గ్రామ పరిధిలో గల తమ వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన కుమారుడి మృతికి కారణమైన నోముల పెద్దయ్య, మల్లేశ్, యాదమ్మపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడి తల్లి యాదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



తుర్కపల్లి: మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామ స్టేజీ గురువారం వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. మృతుడు వేసుకున్న షర్ట్ పైన 'శేఖర్ టైలర్, భోగారం' అని లేబుల్ ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్ట్

మిర్యాలగూడ అర్బన్: పేకాట స్థావరంపై గురువారం మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణం ప్రకాష్‌నగర్‌లోని కాలువ సమీపంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వారు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తి పరారయ్యాడు. వారి వద్ద నుంచి రూ.18,650 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో చక్రపాణి అలియాస్ చక్రి, ఎర్రబోతు వెంకట్‌రెడ్డి, బర్మాత్ రమణ, గుండ్రతి ప్రవీణ్‌గౌడ్, ఏలకపర్ల నాగేందర్, అవుకు బ్రహ్మంను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండ శ్రీను అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


తాళం వేసిన ఇంట్లో చోరీ

- అర కిలో వెండి సామగ్రి అపహరణ

కొండమల్లేపల్లి: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి అర కిలో వెండి సామగ్రి అపహరించుకెళ్లారు. ఈ సంఘటన గురువారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని విలేకరుల కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. విలేకరుల కాలనీలో నివాసముంటున్న దుండిగల్ల అశోక్ భార్య గురువారం ఉదయం యాదగిరిగుట్ట దర్శనానికి వెళ్లింది. ఓ ప్రైవేట్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న అశోక్ రోజుమాదిరిగా కాలేజీకి వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు మధ్యాహ్నం సమయంలో తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలోని సామగ్రిని చిందరవందరగా పడేశారు. సాయంత్రం అశోక్ ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉండడం, ఇంట్లోని సామగ్రి చిందరవరంగా ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా అరకిలో వెండి సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వీరబాబు క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేలకు సారం.. పంటకు జీవం

- సేంద్రియ వ్యవసాయం వైపు రైతుల మొగ్గు
- అధిక దిగుబడులతో పాటు సాగు ఖర్చులూ తగ్గుతాయని నిపుణుల సూచన



హుజూర్‌నగర్‌రూరల్ : మెరుగైన పంట దిగుబడి సాధించేందుకు అన్నదాతలు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. వానాకాలం సీజన్ ఆరంభం కానుండటంతో రైతులు భూములను సిద్ధం చేసుకుంటున్నారు. నేలను సారవంతం చేయడం, భూసారం పెంచడం, దుక్కులు దున్నడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. భూసారం కోల్పోయి పంట దిగుబడి రాక నష్టాలను చవిచూస్తున్న రైతులు పెట్టుబడుల భారం తగ్గించి నాణ్యమైన దిగుబడులు సాధించాలన్న లక్ష్యంతో సేంద్రియ ఎరువులపై ఆసక్తి కనబరుస్తున్నారు.

సేంద్రియ ఎరువులు వాడితే..

మార్కెట్లో రసాయనిక ఎరువుల ధరలు రోజురోజుకు భారీగా పెరగడంతో పాటు వాటినే ఎక్కువగా రైతులు వాడుతుండడంతో భూములు సారం కోల్పోయి క్రమంగా దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో రైతులు పంట దిగుబడుల కోసం చెరువు మట్టి, పశువుల ఎరువులతో భూసారం పెరిగి పంట దిగుబడులు వస్తాయని పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. రసాయన ఎరువులు ఎక్కువగా వాడకంతో దిగుబడులు పడిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కృత్రిమ ఎరువుల కంటే సహజ సేంద్రియ వ్యవసాయంతో భూసారాన్ని రక్షించడంతో పాటు బంగారు పంటలు పండించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. భూమి నిస్సారం చేసే రసాయనిక ఎరువుల బదులు సేంద్రియ ఎరువులు వాడితే సాగు ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని సలహాలు ఇస్తున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం కంపోస్ట్ ఎరువు తయారీతో పాటు పొలాల్లో పశువుల పెంటలు పెట్టడం, సేకరించిన ఎరువులను పొలాల్లో చల్లుకోవడం లాంటి పనులతో రైతులు బిజీబిజీగా ఉన్నారు.


ఎరువు కోసం పొలంలో తోలిన గొర్రెల మంద


పొలంలో పోసిన చెరువు మట్టి

సేంద్రియ ఎరువునే వాడుతున్నా



పొలంలో మూడేండ్లుగా సేంద్రియ ఎరువులనే వాడుతున్నాం. దీంతో గతేడాది మంచి దిగుబడి వచ్చింది. రసాయన ఎరువు వాడకం తగ్గించడంతో మొక్క ఏపుగా పెరగడంతో పాటు మంచి దిగుబడి వస్తుంది. సేంద్రియ ఎరువుతో పండించిన పంటలు బాగున్నాయి. ఈ వరి ధాన్యం బియ్యం పట్టుకుని ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది.

– గునగంటి కనకయ్య, రైతు సీతారాంపురం

అనేక పోషకాలు ఉంటాయి



సేంద్రియ ఎరువులలో అనేక పోషకాలు ఉంటాయి. రసాయన ఎరువులు పదేపదే వాడితే మేలుకంటే కీడే ఎక్కువ. సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలి. పొలాల్లో గొర్రెలు, మేకల పెంటలను పెట్టుకోవాలి. కోళ్ల ఎరువులతోనూ మంచి ఫలితాలుంటాయి.

– రావిరాల స్వర్ణ ఏఓ, హుజూర్‌నగర్